## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బుధవారం అందజేశారు. లబ్ధిదారుల్లో నారపల్లికి చెందిన లక్ష్మ బీనాయక్ ఉన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు మీసాల రాజేష్, నాయకులు నర్రి కాశయ్య, నర్సింహ, అయోధ్య, షబ్బీర్ తదితరులున్నారు.

## ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు



అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: భారత క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే. అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు అవుషాపూర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అబ్దుల్ కలాం పార్కులోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ,లక్ష్మారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, మహేష్, భానుయాదవ్, ప్రవీణ్, రఘురాంరెడ్డి, సాయిలు, స్థానికులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



చీర్యాల డబుల్ బెడ్రూమ్ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల డబుల్ బెడ్రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలపై బుధవారం కమిషనర్ వెంకట్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు కమిషనర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కీసర మండల బీజేపీ అధ్యక్షుడు కోల బాలరాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

## బీసీ జేఏసీ కన్వీనర్‌గా విజయ్‌కుమార్



పోచారం: బీసీ జేఏసీ ఉమ్మడి ఘట్‌కేసర్ మండల కన్వీనర్‌గా చౌదరిగూడకు చెందిన కురుపాల విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రాన్ని అందజేశారు. విజయ్ మాట్లాడుతూ.. ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## స్నేహితుడిపై దాడి.. కేసు నమోదు

మల్కాజిగిరి: ఓ వ్యక్తి స్నేహితుడిపై దాడిచేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఆవుల సురేష్ ఆటో డ్రైవర్. కాగా విష్ణుపురికాలనీకి చెందిన లక్ష్మణ్ ఇద్దరూ స్నేహితులు. కాగా లక్ష్మణ్ సురేష్ బైక్ తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నాడు. తనఖా పెట్టిన బైక్ విడిపించమని అనేకసార్లు అడిగినా విడిపించలేదు. దీంతో ఈనెల 14న సురేష్ నిలదీయడంతో అతడి ఆటో అద్దం పగులగొట్టి దాడికి పాల్పడ్డాడు. బాధితుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముంపు సమస్యను పరిష్కరించండి

మల్కాజిగిరి: బాలసరస్వతీనగర్‌లో ముంపు సమస్యను పరిష్కరించాలని స్వచ్ఛభారత్ మల్కాజిగిరి కన్వీనర్ నాగరాజు కాలనీవాసులతో కలిసి సర్కిల్ ఈఈ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ.. యూజీడీని పొడిగించడమే కాకుండా పైపులైన్ ద్వారా నీటిని మళ్లించాలని కోరారు. ఇంకుడు గుంతలతో పాటు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయడం వల్ల అదనపు నీటిని ఉపయోగించకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. విఠోబా, నారాయణ, వెంకటేష్, భూషణ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమెలా ?

- నిత్యం సమస్యలతో అవస్థలు పడుతున్న ప్రజలు
- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల నిర్వహణ

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనమైన కీసర అభివృద్ధిలో వెనుకంజలోనే ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ వివిధ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు ప్రతి నిత్యం సమస్యల మధ్య సహవాసం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడం, అధ్వానంగా ఉన్న కాలనీల రహదారులు, వీధిదీపాలు వెలగకపోవడం, మిషన్ భగీరథ పథకం చేపట్టినప్పటికీ సరైన తాగునీటి సరఫరా వ్యవస్థ లేకపోవడం వల్ల కీసరలో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తుంది. శుభాష్‌నగర్, కృష్ణానగర్, 208 కాలనీ, లక్ష్మీనగర్, నందినినగర్‌కాలనీ, రెడ్డికాలనీ, బోగారం రహదారిలోని రామలింగేశ్వరనగర్ గోరిలబాయ్‌కాలనీ, బంగారుమైసమ్మ కాలనీల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి.



కీసరలో అంతర్గత రహదారి దుస్థితి

### భరించలేని దుర్వాసన..

కొన్ని కాలనీల్లో ఇప్పటికీ ఓపెన్ కాల్వలే ఉండటం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పందులు, ఈగలు, దోమల బెడద అధికంగా తయారైంది. ఇక కీసరగుట్ట రహదారిలో నిర్మించిన బస్తీ దవాఖానా ప్రారంభం కాకముందే భవనం శిథిలావస్థకు చేరుకుంది. కీసర నుంచి కిలోమీటరు దూరం ఉన్న పీహెచ్‌సీ సెంటర్‌కు వెళ్లి ఇక్కడి ప్రజలు వైద్య సేవలు పొందాల్సి వస్తుంది. ఇక ఎస్సీ కమ్యూనిటీహాల్ పరిస్థితి అంతే. కనీసం మరమ్మతులు చేపట్టడం కుడా లేదని ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలనీల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి (ఫైల్)

### ఇచ్చిన హామీలు గాలికి..

ఎన్నికల సమయంలో కీసరలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి నామినేషన్లు వేయడం మాత్రం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ.. ఇక్కడి ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాత్రం పాలకులు, నిధులు మంజూరు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జనాభాపరంగా కాలనీల పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కీసరను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### పాలకులు పట్టించుకోరా..?

రాష్ట్రంలో ప్రఖ్యాత శైవ క్షేత్రంగా పేరొందిన కీసరగుట్ట దేవాలయం ఉన్న కీసర ప్రాంతం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కీసర ఓఆర్ఆర్ నుంచి కీసరగుట్ట వరకు 4 లైన్ల రహదారి విస్తరణతో పాటు రోడ్డు డి వైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతామంటూ.. ఏళ్ల తరబడి పాలకులు చెబుతూ.. వస్తున్నారే.. తప్పా.. పనులు మాత్రం జరగడం లేదు.

### అభివృద్ధి పనులు చేపట్టాలి



వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టాలి. కాలనీలో అంతర్గత మురికి కాల్వల నిర్మాణాలు, సీసీరోడ్లు, ఏర్పాటు చేయడంతో పాటు వీధి దీపాలు సరిగ్గా వెలిగేలా తగిన చర్యలు తీసుకోవాలి.

– బండారి శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌నగర్

### సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు



కీసరలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతాం. కీసరలో వివిధ కాలనీల్లో పర్యటించి సమస్యలను గుర్తించాం. త్వరలో నిధులు మంజూరు చేసి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతాం.

– వెంకట్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్

## గురుకులాల అభివృద్ధిపై సమీక్ష



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇటీవల జరిగిన పరిణామాలపై కళాశాల ఆవరణలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు మహోన్నత చరిత్ర కలిగిన గురుకుల్ ప్రతిష్టతను కించపరిచేలా కొందరు వ్యవహరిస్తున్న తీరును సమావేశంలో ముక్తకంఠంతో ఖండించారు. గురుకుల్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరి బాధ్యత ఉందన్నారు. ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సుదర్శరెడ్డి, నాయకులు సంజీవగౌడ్, లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, హెచ్ఎం రజిని, మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మురళీగౌడ్, అన్ను, నజీర్, రాజాచారి, కమలాకర్, విక్రాంత్‌రెడ్డి, యాదగిరి, సిరాజ్, జహంగీర్, నగేష్, ఖలీల్ పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరం



ఏదులాబాద్‌లో పశువులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఘట్‌కేసర్: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏదులాబాద్ గ్రామంలోని పశువైద్యశాలలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అధికారి శంకర్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. శిబిరంలో పశువులకు చుడి పరీక్షలు, గర్భకోశ నివారణ చికిత్స, నట్టల నివారణ మందులు యజమానులకు అందజేశారు. 100 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయించాలని సూచించారు. పశువైద్యాధికారులు పద్మిని, నరేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, సిబ్బంది భషణ్ కులకర్ణి, శంకర్‌రెడ్డి, గణేష్‌ముదిరాజ్, శ్రీకాంత్, స్వప్న రైతులు పాల్గొన్నారు.

## మత్స్యకార సొసైటీ కార్యాలయం ప్రారంభం

పోచారం: నారపల్లిలో ప్రాథమిక మత్స్యకార సహకార సొసైటీ కార్యాలయాన్ని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మన్నెరాజు ప్రారంభించారు. అనంతరం బుధవారం నారపల్లిలోని చెరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చెరువులపై పూర్తి హక్కులు మత్స్యకారుల సొసైటీకే ఉంటాయన్నారు. స్థానిక మత్స్యకారులు, నాయకులు పాల్గొన్నారు.

## 'ఐసీఈయూ' నూతన కార్యవర్గం

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరంలో 'ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్' (ఐసీఈయూ) సమావేశం జరిగింది. బుధవారం జరిగిన సమావేశంలో డివిజన్ నాయకులు మద్దిలేటి, గణేష్, రవీందర్‌లు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థగా ప్రభుత్వ రంగంలోని ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా ప్రజల మన్ననలను పొందిందన్నారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అబిడ్స్‌శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం వీరే..**

అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణన్, కార్యదర్శిగా నవీన్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాసులు, శ్రీకాంత్, కోశాధికారిగా శ్రావ్య, జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా వీరగోని రమేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎల్ఐసీని మరింత బలోపేతం చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించాలని కోరుతూ పలు తీర్మానాలను చేశారు.

## మెడిసిటీలో 'వరల్డ్ అనాటమి డే'



మృతదేహాల దాతల కుటుంబసభ్యులను సన్మానిస్తున్న వైద్యులు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనాపూర్ మెడిసిటీ మెడికల్ కళాశాలలో బుధవారం 'వరల్డ్ అనాటమి డే' నిర్వహించారు. కళాశాలకు మృతదేహాలను దానం చేసిన మృతుల కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. వైద్య విద్యలో కీలకపాత్ర పోషించే మృతదేహాల దానంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవ శరీరంపై అనాటమీ పరిశోధనలు చేసేందుకు కృషిచేసిన ఇండ్రియాస్ వెసాలియస్ వర్ధంతి సందర్భంగా వరల్డ్ అనాటమిడే ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్రసింగ్ నేగి, శివరామకృష్ణ, శైలంద్ర, సుబ్బారావు, కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మౌనిక పాల్గొన్నారు. మృతదేహాలను అందజేసిన అమ్మ ఆర్గాన్స్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

## పిట్ట కొంచెం.. ఆలోచన ఘనం !

సైకిల్‌కు 'ఎల్' బోర్డుతో ఆదర్శంగా బాలుడు



జమ్మిగడ్డలో 'ఎల్' బోర్డుతో సైకిల్‌పై వెళ్తున్న బాలుడు

కాప్రా: కార్లు, బైక్‌లకే కాదు.. సైకిల్‌కు కూడా.. 'ఎల్' బోర్డు వేసి పలువురికి ఓ బాలుడు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఏఎస్‌రావునగర్ జమ్మిగడ్డ నుంచి కాప్రా ఎల్లారెడ్డిగూడ మార్గంలో ఓ బాలుడు స్కూల్ నుంచి తన చిన్న సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాను సైకిల్ నేర్చుకునే దశలో ఉన్నానని, వెనుక నుంచి ముందు నుంచి వచ్చేవారు కాస్తా.. చూసి వెళ్లండని, ఎల్ బోర్డు వేసుకుని వెళ్తున్నాడు. చిన్నవాడైనా అందరికీ ఓ మంచి మెసేజ్ ఇచ్చేలా వెళ్తుండటంతో బాలుడుని పలువురు అభినందిస్తున్నారు. లర్నింగ్ లైసెన్స్‌తో ఉండి ఎల్ బోర్డు లేకుండా తిరిగేవారికి కనీస బాధ్యత లేకుండా చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాల్లోకి నెట్టేలా ప్రోత్సహిస్తున్న కొందరికి ఈ బాలుడి ఆలోచనతోనైనా కనువిప్పు కలగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టడంతో పాటు అందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. బుధవారం సచివాలయం నుంచి వర్షాకాలం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్రమంత్రులు కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు రఘునందన్‌రావు, స్టీఫెన్ రవీంద్ర నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. ధాన్యం దిగుబడిలో తెలంగాన ఆల్ టైమ్ రికార్డ్ సాధించిందన్నారు. స్వతంత్ర భారతదేశంలోనే ఈ వర్షాకాలంలో అత్యధికంగా 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ధాన్యం కొనుగోలులో సరికొత్త రికార్డు, అధిక దిగుబడి, అధిక కొనుగోళ్ల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలన్నారు. సమస్యలు ఎదురైతే సత్వరమే తమతో పాటు పౌరసరఫరాల కమిషనర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లై డీఎం సుగుణబాయి, డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## డీసీపీ విజిబుల్ పోలీసింగ్



విజిబుల్ పోలీసింగ్‌లో పాల్గొన్న డీసీపీ పద్మజ

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో నిర్వహించిన విజిబుల్ పోలీసింగ్‌లో డీసీపీ పద్మజారెడ్డి పాల్గొని వాహనదారులు, స్థానికులతో శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసులు నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. సమాజంలో నేరాల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటూనే స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

కీసర: బొడ్రాయి బోనాల పండుగను విజయవంతంగా నిర్వహించినందుకు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని బుధవారం కీసర రైతు సహకార సొసైటీ అధ్యక్షులు రామిడి ప్రభాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. బోనాల సందర్భంగా కీసరలో ఆయా దేవాలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం చక్కటి ఏర్పాట్లు కమిషనర్ చేపట్టారని, దీంతో కీసర ప్రజల మన్ననలు పొందాడని తెలిపారు. కీసరగుట్ట దేవాలయం సభ్యులు నల్ల మధుసూదన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఆర్ఐ గంగన్న పాల్గొన్నారు.



కమిషనర్ వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ ఉత్తర్వులు ధిక్కరించొద్దు !

మేడ్చల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి



శామీర్‌పేట్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించేందుకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను ధిక్కరించి మరో భవనంలోకి కార్యాలయాన్ని ప్రారంభిస్తే సంబంధిత అధికారులు, నాయకులు గానీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం శామీర్‌పేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శామీర్‌పేట్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రైవేటు భవనంలో అసౌకర్యవంతంగా నడుస్తుందన్నారు. దీంతో ఖాళీగా ఉన్న శామీర్‌పేట్ మండల పరిషత్ భవనంలోకి తరలించేందుకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ గతనెల 15న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఉత్తర్వులకు అనుకూలంగా కలెక్టర్ మను చౌదరి గత నెల 23న మండల పరిషత్ కార్యాలయానికి తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల కాపీని తాను శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్‌కు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. కొందరి స్వలాభం కోసం స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖకు చెందిన రాష్ట్ర, జిల్లా అధికారులు, నాయకులు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ.. దర్గా చౌరస్తా వద్ద ఉన్న భవనంలోకి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరిస్తే ఎంతటి వారైనా.. సహించేది లేదని, వారిపై చర్యలు తీసుకునేలా లోకాయుక్త కోర్టును ఆశ్రయిస్తానన్నారు. అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని ఆయన కోరారు. అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, సొసైటీ డైరెక్టర్ బిక్షపతి, అలియాబాద్ మాజీ ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, మజీద్‌పూర్ మాజీ సర్పంచ్ మల్లేష్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి



కుషాయిగూడ: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్.బోస్ డిమాండ్ చేశారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ జిల్లా సమితి, బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అమలుకు ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బీసీ సామాజికవర్గాలకు చెందిన ప్రజలంతా ఐక్యతను చాటి బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు బాపిరాజు, దశరథ్, కృష్ణ సీపీఐ నేతలు శ్రీనివాస్, ప్రమీల, మహాలక్ష్మి, మాధవి, నరేందర్, ప్రసాద్, నరసింహ, ధర్మేంద్ర, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

- మల్లారెడ్డి యూనివర్సిటీకి గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్
- ప్రారంభోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో గూగుల్ ఇండియా– మల్లారెడ్డి యూనివర్సిటీతో కలిసి అతిపెద్ద గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్‌ను ప్రారంభించారు. గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే మల్లారెడ్డి, గూగుల్ సంస్థ ప్రతినిధులతో కలిసి క్యాంపస్‌ను బెలూన్స్ గాల్లోకి వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు.

**కలలు సాకారం చేసుకోవాలి..**

గొప్పగా కలలు కనడంతో పాటు వాటి సాకారానికి కృషి చేయాలని, కలలు లేకుంటే జీవితమే లేదన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, దేశ ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు.

**అతిపెద్ద డిజిటల్ క్యాంపస్..**

గూగుల్ ఇండియాతో కలిసి మల్లారెడ్డి యూనివర్సిటీలో అతిపెద్ద డిజిటల్ క్యాంపస్‌ను ప్రారంభించడం అనుసందానంలో భాగమేనన్నారు. విద్యార్థులు, యువత కలలు సాకారం చేసుకునేందుకు గూగుల్ సంస్థ కృషి చేయడం హర్షనీయమన్నారు.

**గ్రామీణ స్థాయి నుంచే ఉన్నత విద్య అందాలి..**

దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామీణస్థాయి నుంచే జరగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువతకు ఉన్నత విద్యను అందిస్తే దేశం ముందుకెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి నైపుణ్యాలు, సాంకేతికతను అనుసందానం చేసే దిశగా కృషి చేస్తున్నారని కొనియాడారు.

**పేద విద్యార్థులను ఇంజినీర్లుగా తీర్చిదిద్దమే లక్ష్యం : ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని సాంకేతికత, నైపుణ్యాలు శాసిస్తున్నాయన్నారు. ప్రపంచంలో ఎటు చూసినా నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని, వాటిని వినియోగించుకుంటున్న దేశాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని చెప్పారు. గూగుల్ ఇండియాతో కలిసి యూనివర్సిటీలో అతిపెద్ద క్యాంపస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రపంచశ్రేణి ఇంజినీర్లుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. గూగుల్ సంస్థ ఇండియా హెడ్ వైభవ్‌కుమార్, సంజయ్‌జైన్, సౌత్ ఇండియా హెడ్ సిద్దార్థ్, మల్లారెడ్డి యూనివర్సిటీ ఛాన్స్‌లర్ కల్పన, మల్లారెడ్డి గ్రూప్స్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ భద్రారెడ్డి, వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే.రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.